క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గ పరిధిలో బుధవారం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు నగరి క్యాంప్ కార్యాలయంలో చెన్నై శంకర్ నేత్రాలయ, రోజా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించే ఉచిత కంటిపొర ఆపరేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నగరి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రూ.3 వేలు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత నింద్ర మండలం కొప్పేడులో రూ.33 లక్షల అంచనా వ్యయంతో నూతన స్పోర్ట్స్ జిమ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు మార్కెట్ కమిటీలో రూ.3 వేలు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

డీకేటీ భూములకు పట్టా

శ్రీరంగరాజపురం: డీకేటీ భూములకు శాశ్వత పట్టా ఇస్తున్నట్లు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని తయ్యూరు, 49 కొత్తపల్లిమిట్ట సచివాలయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రెవెన్యూ అధికారులు శాశ్వత పట్టా పొందడానికి అర్హులను గుర్తించారని, వివరాలు సంబంధిత వలంటీర్ల లాగిన్‌లో పొందుపరిచామని, లబ్ధిదారులు వలంటీర్ల లాగిన్‌లో ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేసుకుంటేనే డీకేటీ భూములు శాశ్వత పట్టాలుగా గుర్తించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ బెన్నురాజ్, సర్పంచ్‌లు ఉమామహేశ్వరి, వరదమ్మ, ఢిల్లెయ్య, ఆర్ఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

విజయపురం (నగరి) : మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ జమున అధ్యక్షత నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ దంపతులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం ఆవరణలో ఓంశక్తి భక్తులకు మంగళవారం ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ దంపతులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్, ఎంపీటీసీ సభ్యుడు ధన్‌రాజ్ పాల్గొన్నారు.

బంగారు చైన్ అందజేత


బాధితురాలికి చైను అందిస్తున్న సీఐ

నగరి: పోగొట్టుకున్న 2 సవర్ల బంగారు చైనును పోలీసులు వెతికి బాధితురాలికి అందించారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు సరిహద్దు పూనిమాంగాడుకు చెందిన శక్తివేల్ భార్య అన్నరసి డిసెంబరు 31వ తేదీ నగరి పట్టణంలోని శ్రీనివాసా థియేటర్ వద్ద 2 సవర్ల బంగారు చైన్ పోగొట్టుకుంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు అందించింది. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బంగారు చైనును కనిపెట్టారు. మంగళవారం బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

దుప్పట్లు, పంచెల పంపిణీ



శ్రీరంగరాజపురం: మండలంలోని ఒడ్డుపల్లెలో 300 మంది పేదలకు ఎనర్జియా లైఫ్ సైన్సెస్ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లు, పంచెలు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధినేత రాజీవ్ చంద్రబోస్ మాట్లాడుతూ ఏటా తమ ట్రస్టు తరఫున పేదలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో పేదలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. వేలూరు సీఎంసీ పాస్టర్లు విజయకుమార్, ఆబెల్‌ప్రభు, వినోద్‌కుమార్, సీఎంసీ వైద్యులు జీవరత్నం పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన లాస్యమేదశ కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు రూ.లక్ష విరాళంగా అందించారు. మంగళవారం వారు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు విరాళం అందించారు. ఆలయాధికారులు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

నాడు అసాధ్యం.. నేడు సుసేద్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


శ్రీరంగరాజపురం: ముద్దుకుప్పంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


కార్వేటినగరం: లబ్ధిదారులకు మోటార్లు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: నాడు అసాధ్యమైన వ్యవసాయం నేడు సుసేద్యంగా మారిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జలకళ అడిషనల్ పీడీ ఉమావాణి ఆధ్వర్యంలో వైఎస్సార్ జలకళ లబ్ధిదారులకు మోటార్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశానికి వెన్నెముకలాంటి రైతులకు నీటి సమస్య లేకుండా ఆదుకోవడానికి వైఎస్సార్ జలకళ ద్వారా ఉచితంగా బోర్లు వేయించి, రూ.లక్షల విలువ చేసే మోటార్లను ఉచితంగా పంపిణీ చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాల్లో అంతులేని అవినీతి జరిగిందని ఆరోపించారు. అయితే నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులు హర్షించేలా వారికి చేరుతున్నాయని చెప్పారు. జగనన్న పాలన పారదర్శకానికి చిరునామాగా నిలిచి పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, వైస్ ఎంపీపీ మణెమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్, ఎంపీడీఓ మోహన్‌మురళి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని ముద్దుకుప్పం సచివాలయం పరిధిలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దేశంలో ఎక్కడా లేని ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టి పేదలకు దేవుడయ్యారన్నారు. నేడు రాజన్న తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీదైన వైద్యాన్ని ప్రజల ఇంటి గుమ్మం వద్దకు తీసుకువచ్చారన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ప్రజలు రూ.లక్షలు ఖర్చు చేసుకోకూడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి, నిపుణులైన వైద్యులతో నాణ్యమైన వైద్యం అందిస్తుందని చెప్పారు. శిబిరంలో 640 మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన 258 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సునీల్‌నాయక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రభావతి, జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధయ్య, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ


గంగాధరనెల్లూరు: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీపీ అనిత

గంగాధరనెల్లూరు: రాష్ట్రంలో జనవరి 2వ తేదీ నుంచి పండుగ వాతావరణంలో పెంచిన పింఛన్ల పంపిణీ సాగుతుందని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ ఒక అన్నగా, మేనమామగా, కొడుకుగా, మనవడిగా రాష్ట్ర ప్రజలకు సేవలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.2,750 సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి అందిస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, నాయకులు మునిరాజారెడ్డి, సురేందర్ రెడ్డి, ఏకాంబరం పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజయపురం : వాలీబాల్ ఆడుతున్న బాలికలు

విజయపురం (నగరి) : క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. మంగళవారం విజయపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం-ఆంధ్రలో భాగంగా వాలీబాల్ పోటీలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్తరా నక్షత్ర పూజలు


సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి : పట్టణ బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. భజనలు, అయ్యప్ప కీర్తనల ఆలాపనలతో పండగ వాతావరణం నెలకొంది. భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు మాధురి, దిలీప్‌కుఆర్ ఉభయదారులుగా వ్యవహరించారు. గురుస్వామి మురళి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు


టీకా వేస్తున్న పశుసంవర్థక డీడీ గోవిందయ్య

కార్వేటినగరం: గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం చేయవద్దని పుత్తూరు పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోవిందయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సర్పంచ్ ధనంజయ వర్మ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ పశువులకు అతి ప్రమాదకరమైన వ్యాధి గాలికుంటు అని అన్నారు. ఈ వ్యాధి నివారణకు ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం వంద పశువులకు టీకాలు వేశారు. పశువైద్యాధికారి కే.హేమకుమార్, సహాయకులు పాల్గొన్నారు.

శ్రీసిటీ సందర్శనకు రండి

- ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం
- పీఎస్ఎల్వీ సీ-58 విజయవంతంపై అభినందన


ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు: పీఎస్ఎల్వీ సీ-58 రాకెట్ ప్రయోగం విజయవంతంపై ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్, షార్ డైరెక్టర్ ఏ. రాజరాజన్, షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ అద్భుత ఘట్టాన్ని షార్ విజన్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చొని వీక్షించిన ఆయన, అంతరిక్ష సాంకేతికలో అగ్రగామిగా భారత దేశం స్థానాన్ని సుస్థిరం చేస్తూ, ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషిని, అంకితభావాన్ని కొనియాడారు. శ్రీసిటీ వేగవంతమైన ప్రగతిని విస్తరిస్తూ, తాజా అభివృద్ధిని ప్రత్యక్షంగా చూసేందుకు ఇస్రోకు సహకరిస్తున్న పరిశ్రమల సీఈఓలతో కలసి సంభాషించేందుకు శ్రీసిటీని సందర్శించాలని సోమనాథ్‌ను రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానించారు. ఆహ్వానాన్ని అంగీకరించిన డాక్టర్ సోమనాథ్ 2019, మే లో వీఆర్‌వీ(చార్ట్(గ్రూప్) పరిశ్రమకు చెందిన క్రయోజెనిక్ ట్యాంక్‌ను షార్‌కు అప్పగింత కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తాను శ్రీసిటీ సందర్శనను గుర్తు చేసుకుంటూ, ఇస్రోకు శ్రీసిటీకి చెందిన కొన్ని కంపెనీలు అందిస్తున్న కీలకమైన సహకారానికి అభినందనలు తెలిపారు. కాగా శ్రీసిటీకి చెందిన వీఆర్‌వీ(చార్ట్ గ్రూప్) రోటోలాక్, వాల్-మెట్ ఇంజినీరింగ్, నోవా ఎయిర్, సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలు తమ ఉత్పత్తుల సరఫరా, సేవల ద్వారా చంద్రయాన్-3, ఆదిత్య ఎల్ -1 మిషన్‌లతో సహా వివిధ ఇస్రో ప్రాజెక్టులలో పాలు పంచుకున్నాయి.

క్రీడా పరికరాల వితరణ


క్రీడాపరికరాలు అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నగరి : ఇటీవల నిర్వహించిన జోనల్ క్రీడల్లో అన్ని క్రీడల్లో రాణించి పాఠశాలను మొదటి స్థానంలో నిలపడంతో నాగరాజుకుప్పం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు క్రీడాభివృద్ధికి అండగా నిలిచారు. తమవంతు సహకారం అందించేందుకు రూ.25 వేల విలువజేసే క్రీడా సామగ్రిని కొనుగోలు చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు అందించారు. ప్రధానోపాధ్యాయులు మోహన్ రామ్, పురుషోత్తమాచారి, పీడీ చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



వెదురుకుప్పం: నల్లవెంగనపల్లెలో మందుల పంపిణీ, పాలసముద్రం: వనదుర్గాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, జెడ్పీటీసీ

వెదురుకుప్పం: పేదలకు మెరుగైన వైద్యసేవలను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నల్లవెంగనపల్లెలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదవారికి వైద్యం భారం కాకూడదన్న సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. సర్పంచ్ పుష్ప మాట్లాడుతూ రూ.5 లక్షలున్న ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచి సీఎం జగనన్న ఆపద్బాంధవుడయ్యారన్నారు. రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్యాధికారి సురేఖ, ఈఓపీఆర్డీ పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ పాల్గొన్నారు.

సురక్ష పేదలకు శ్రీరామరక్ష

పాలసముద్రం : వనదుర్గాపురంలో ఎంపీడీఓ రామనాథరెడ్డి, సర్పంచ్ నరసింహరాజు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ మాట్లాడుతూ పేదలు తమ ఆరోగ్యంపై ఇక బెంగపడనవసరం లేదన్నారు. 211 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, తహసీల్దార్ బాబు, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సుశీల, మురళి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోలయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం

గంగాధర నెల్లూరు: మండలంలోని అగరంమంగళంలో మంగళవారం సర్పంచ్ సరోజమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎంపీడీఓ సుధాకర్‌తో కలిసి ఎంపీపీ అనిత ప్రారంభించారు. వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. జిల్లా అడిషనల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ వెంకట ప్రసాద్, ఉప సర్పంచ్ వెంకటేశులు శెట్టి, వైద్యులు దుర్గాదేవి, ప్రవీణ్, సీహెచ్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అగరం సచివాలయ పరిధిలో

నింద్ర: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరమని ఎంపీపీ దీప అన్నారు. మంగళవారం మండలంలోని అగరం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో సచివాలయ పరిధిలోని ప్రజలు విచ్చేశారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీఓ అరుణ, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ చెల్లెమ్మ, మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, నాయకులు దామోదరం, సెల్వం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గంగాధర నెల్లూరు: కిట్ల పంపిణీ


నింద్ర: మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

నేటి నుంచి పింఛన్ల పంపిణీ


మాట్లాడుతున్న గోవిందస్వామిరెడ్డి

పుత్తూరు: ప్రభుత్వం రూ.3 వేలకు పెంచిన పింఛన్లను బుధవారం నుంచి అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ పుత్తూరు రూరల్ మండల అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి తెలిపారు. మంగళవారం నేసనూరు సచివాలయంలో వలంటీర్లు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు పింఛన్లు ఇక ఇవ్వరంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, నేటి నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం


గోవిందస్వామిరెడ్డి పుత్తూరు


సుబ్రమణ్యంరెడ్డి వడమాలపేట

పుత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీ నియామకాలు జరిగాయి. పార్టీ పుత్తూరు మండల అధ్యక్షుడుగా ఎం.గోవింద స్వామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.షణ్ముగం, జి.మునిరాజ, జనరల్ సెక్రెటరీలుగా కె.బాబు, ఎం.జయకుమార్, ఏ.శివ, కె.ధాము, సెక్రెటరీలుగా సి.బలరామిరెడ్డి, నాని, కె.రాజారత్నం, ఏ.సుదర్శనం, ఏ.వినోద్, కుమార్‌రాజు, ఎం.ఈశ్వరరెడ్డి, ఎస్.రాజేంద్ర, జాయింట్ సెక్రెటరీలుగా టి.మురగేష్, కె.గోవిందస్వామిరెడ్డి, ఎం.రవిచంద్ర, టి.సుబ్రమణ్యం, పి.మురళి, ఎన్.శివయ్య, ఎ.తులసీరామయ్య, ఎ.వెంకటేష్ నియమితులయ్యారు.

వడమాలపేట..

వడమాలపేట : వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా ఏ.సుబ్రమణ్యంరెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.పృథ్వీ, టి.రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా సుధాకర్‌రెడ్డి, ఏ.మునిశేఖర్, పి.బాబు, ఎస్.కమల, సెక్రెటరీలుగా పి.నాగార్జుననాయుడు, వి.సుబ్రమణ్యంరాజు, వి.రమేష్‌యాదవ్, వి.బాలకృష్ణయ్య, డి.అయ్యప్పరెడ్డి, ఐ.సుధాకర్, ఎం.రమేష్‌రాజు, దీపక్ నియమితులయ్యారు. జాయింట్ సెక్రెటరీలుగా పి.రంగనాథం, టి.మురళి, కె.రవికుమార్‌వర్మ, ఇరగారెడ్డి, కె.మాధవరాజు, బి.వెంకటరెడ్డి, పి.కిరణ్‌కుమార్, ఎం.రాంబాబు నియమితులయ్యారు.

మండల కమిటీలో..

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరి మండల కమిటీలో పలువురికి స్థానం లభించింది. ప్రధాన కార్యదర్శులుగా ఎస్.సంజీవరెడ్డి, నాగవేలు, కేఈ రవి, ఎస్.వేలు, కార్యదర్శులుగా జయకుమార్, హరినాయుడు, రామ్మూర్తి, కిరణ్, శ్రీనివాసులు రెడ్డి, సురేష్, ఎస్.రామచంద్రారెడ్డి, ఎం.శశికుమార్, సహకార్యదర్శులుగా కె. మధు, సత్య, మురగయ్య, ఆనందయాదవ్, టి.మునీంద్ర, గుణశేఖర్, హరిరెడ్డి, శేఖర్ నియమితులయ్యారు.

నింద్ర మండలంలో..

నింద్ర: వైఎస్సార్ సీపీ నింద్ర మండల కమిటీ నియామకంలో పలువురికి స్థానం లభించింది. పార్టీ ఉపాధ్యక్షుడిగా బి.సుధాకర్, జనరల్ సెక్రటరీలుగా కె.రేవతి, దామోదరం, డి.మురళీరాజు, టి.సురేష్, కార్యదర్శులుగా డి.సుబ్రమణ్యంయాదవ్, సి.మహేష్, గోవర్ధన్‌రెడ్డి, ఎం.మురళీకృష్ణరాజు, నరేష్, జయశంకర్, సి.మోహన్, వెంకటేశులు రెడ్డి, భూపాల్, ఎలుమలై ఆచ్చారి, టి.దాము, బాలాజీ, ఎం.ప్రేమ్‌కుమార్, మునస్వామి, దామురెడ్డి నియమితులయ్యారు.

అభివృద్ధి కోసం పనిచేస్తున్న నేత నారాయణ స్వామి

- ఆప్యాయంగా పలకరించి.. సమస్యల పరిష్కారం
- జెడ్పీటీసీ సభ్యుడు మురళీరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీరెడ్డి

తిరుపతి కల్చరల్: నిజాయితీతో ప్రజల సంక్షేమం కోసం, నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తున్న నాయకుడు ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అని వెదురుకుప్పం మండలం, పెరుమాళ్లపల్లె జెడ్పీటీసీ సభ్యుడు మురళీరెడ్డి కొనియాడారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఇంటికి వచ్చిన నేతలు, కార్యకర్తలను నారాయణస్వామి ఎంతో ఆప్యాయతతో పలకరించి, వారి సమస్యలను పరిష్కరిస్తూ ప్రజాదరణ పొందుతున్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వెదురుకుప్పం నియోజవర్గంలో సుమారు 14 రోడ్లు వేయించడంతోపాటు ఒక ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాలను నియోజకవర్గానికి అందించిన ఘనత ఆయనదేనన్నారు. మరో జెడ్పీపీటీసీ సభ్యురాలు రాధిక మాట్లాడుతూ గతంలో తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేసి జెడ్పీటీసీ సభ్యురాలి గెలిచినా నారాయణస్వామి మంచితనంతో తాను వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, బొజ్జారెడ్డి, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

పొదుపు పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : మండలంలోని డ్వాక్రా సంఘాల్లో పొదుపు సక్రమంగా కట్టుకుని, పొదుపు మొత్తాలను పెంచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్రలు, వీఓ లీడర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఇప్పటివరకు చేసుకున్న పొదుపు ఏ స్థాయిలో ఎంత చేసుకోవాలనే విషయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రికార్డులు నిర్వహణ, అంతర్గత, బహిర్గత ఆడిట్ పాలసీలు, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్‌వారు ఇచ్చిన సూచన అమలు పరచాలన్నారు. మండల మహిళ సమాఖ్య పరిధిలో ఫైనాన్సియల్ మేనేజ్ మెంట్ పాలసీపై అవగాహన పెంచుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సి బాధ్యత సంబంధిత సంఘమిత్ర, లీడర్లపై ఉందని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


దీపారాధన చేస్తున్న వేదపండితులు

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురంలోని శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఈ సందర్భంగా నూతన వస్త్రాలు, పూజా సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. ఉభయకర్తలు తీసుకొచ్చిన నూతన వస్త్రాలతో స్వామివారికి అలంకరించి, దీపారాధన, పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రశాఖ ముద్రించిన నూతన సంవత్సర డైరీని మంగళవారం గంగాధర నెల్లూరులో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ముద్రించిన నూతన సంవత్సర డైరీ చాలా ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి ఈ డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు యువరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి జైకాంత్ , సభ్యులు నాగరాజు, బాబు, కార్తీక్‌రెడ్డి, కుమార్, బాలాజీ, చంద్రశేఖర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.